క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు రాజవరం విద్యార్థులు



త్రోబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కొయ్యలగూడెం: రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు తమ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు రాజవరం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బి.రామారావు పేర్కొన్నారు. 2023 త్రోబాల్ జిల్లా స్థాయి సెలెక్షన్లు తణుకు ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించగా ఇందులో అండర్–17 విభాగంలో పి.శశాంక్, అండర్–14 విభాగంలో జె.హేమంత్‌కుమార్, ఓ.నందకిషోర్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు అర్హత సాధించారన్నారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు జె.శ్రీనివాస్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

బతుకమ్మ సంబరాలు ప్రారంభం

కుక్కునూరు: దసరా శరన్నవరాత్రులలో భాగంగా శనివారం మండల వ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఎంగిలపూల బతుకమ్మ వేడుకను నిర్వహించారు. మహిళలు, యువతులు బతుకమ్మ పాటలతో సందడి చేశారు. కాగా ఈ సంబరాలు తొమ్మిదిరోజుల పాటు నిర్వహించనున్నారు. తొమ్మిదవ రోజైన దుర్గాష్టమి నాడు బతుకమ్మ ఉత్సవాల ముగింపు ఉత్సవం ఉంటుంది. విలీన మండలాల్లో తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

జంగారెడ్డిగూడెం: ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వినోద్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సాధారణ రోజుల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 8 గంటల వరకు తరగతులు నిర్వహించడమే కాకుండా రెండో శనివారం, ఆదివారం పండగ సెలవు రోజుల్లో కూడా ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు తరగతులు నిర్వహిస్తున్నాయని, విద్యాశాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా, సెలవు రోజుల్లో కూడా ర్యాంకుల పేరుతో విద్యార్థులను మానసిక ఒత్తిళ్లకు గురిచేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై తక్షణమే విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, గుర్తింపును కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఆటోలకు పార్కింగ్ స్థలం కేటాయించాలి

కుక్కునూరు: ఆటోలకు పార్కింగ్ స్థలం కేటాయించాలని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ కోరారు. శనివారం సీతారామరాజు ఆటో యూనియన్ సమావేశం పోచారపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో సాయికిరణ్ మాట్లాడుతూ ఆటోలు పెట్టుకునేందుకు సరైన స్థలం లేకపోవడంతో ప్రయాణికులను ఎక్కించుకునే వీలులేక ఆటోడ్రైవర్లు ఉపాధి కోల్పోతున్నారన్నారు. పార్కింగ్ స్థలం విషయమై అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కింగ్ స్థలం కేటాయించాలని లేనిపక్షంలో ఈనెల 19వ తేదీ నుంచి యూనియన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్టు చెప్పారు. యూనియన్ సభ్యులు దార క్రిష్ణ, హరీష్, రాము, జగన్, తదితరులు పాల్గొన్నారు.

పోడు భూముల్లో సిరుల పంటలు

- పోడు భూములకు పట్టాల పంపిణీ
- లబ్ధి పొందిన 3220 మంది గిరిజనులు
- ఆ భూముల్లో ఆయిల్‌పామ్, మామిడి, వేరుశనగ, మిర్చి, వంగ సాగు
- 1459 మందికి రైతు భరోసా పథకం ద్వారా సొమ్ములు జమ
- హర్షం వ్యక్తం చేస్తున్న గిరిపుత్రులు



బుట్టాయగూడెం మండలం మర్లగూడెం అటవీ ప్రాంతంలో పోడు భూముల్లో ఆయిల్‌పామ్, అంతర పంటగా వేరుశనగ వేసిన దృశ్యం



పోడు భూముల్లో మామిడి తోటలు



పత్తి పంట సాగు చేసిన దృశ్యం

బుట్టాయగూడెం: ఒకప్పుడు వారు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండే ఆదివాసీ గిరిజనులు. నేడు ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి దిశగా పయనిస్తున్నారు. విద్య, వైద్యం సౌకర్యాలతో పాటు వ్యవసాయ రంగంలో కూడా అభివృద్ధి సాధించే దిశగా గిరిజనులు అడుగులు వేస్తున్నారు. నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి, నేడు ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొండ ప్రాంతంలో పోడు కొట్టుకుని జీవనం సాగిస్తున్న గిరిపుత్రులకు పోడు భూములకు పట్టాలు ఇచ్చి, ఆ భూముల్లో వ్యవసాయ పంటలు పండించుకునే విధంగా అన్ని ఏర్పాట్లు చేశారు. దీంతో ఒకప్పుడు కేవలం వారి ఆహారం కోసమే సాగు చేసినప్పటికీ నేడు పోడు భూముల్లో రకరకాల పంటలు పండించి వాటిని విక్రయిస్తూ ఆదాయ వనరులను పొందుతున్నారు. ముఖ్యంగా మర్లగూడెం సమీపంలోని అటవీప్రాంతంలో సుమారు 130 మంది పోడు కొట్టుకోగా వైఎస్ రాజశేఖరరెడ్డి 255 ఎకరాలకు పట్టాలను పంపిణీ చేశారు. దీనితో ఆ భూముల్లో రకరకాల పంటలు పండిస్తూ గిరిజన రైతులు జీవనోపాధిని పొందుతున్నారు.

పోడు భూముల్లో ఆయిల్‌పామ్, జీడిమామిడి, మామిడి తోటలు సాగు

మర్లగూడెం సమీపంలోని అటవీప్రాంతంలో గల పోడు భూముల్లో గిరిజనులు ఆయిల్‌పామ్, మామిడి, జీడిమామిడి పంటలతోపాటు వేరుశనగ, ప్రత్తి, కూరగాయల పంటలను కూడా పండిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ భూముల్లో వేసే పంటలకు సాగు నీరు అందించాలనే ఉద్దేశంతో నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి విద్యుత్ సౌకర్యంతోపాటు బోర్లు కూడా వేయించడంతో రైతులకు సాగు నీటి కొరత లేకుండా సమృద్ధిగా పంటలకు నీరు అందుతుంది. దీనితో రకరకాల పంటలు పండిస్తూ రైతులు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు.

రైతు భరోసా పథకంలో లబ్ధి

పోడు వ్యవసాయం చేసుకున్న రైతులకు పట్టాలు ఇచ్చి భూములపై హక్కు కల్పించడమే కాకుండా సుమారు 1459 మంది పోడు రైతులకు రైతు భరోసా ద్వారా రూ. 13,500 చొప్పున రైతుల బ్యాంక్ ఖాతాలోకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొమ్మును జమ చేయడం జరిగింది. నాడు వైఎస్సార్ పాలనలో నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆదివాసీ గిరిజనుల వ్యవసాయాభివృద్ధికి కృషి చేయడం పట్ల గిరిపుత్రులు కృతజ్ఞతలు వ్యక్తం చేస్తున్నారు.

3,220 మందికి 69,815 ఎకరాల్లో పోడు భూములకు పట్టాల పంపిణీ

అటవీప్రాంతంలోని రాళ్లు, రప్పలు, తుప్పలు కొట్టుకుని పోడు వ్యవసాయం చేసుకున్న గిరిజనులకు పట్టాలు లేక నానా అవస్థలు పడుతున్నారు. చోళ్లు, జొన్నలు, బొబ్బర్లు, మినుములు వంటి పంటలు మాత్రమే పండించుకుని గిరిజనులు జీవనం సాగించేవారు. అయితే దివంగత ముఖ్యమంత్రి పాలనలో పోడు భూములకు పట్టాలు ఇవ్వడం జరిగింది. అలాగే ఆయన తనయుడు జగన్ మోహన్‌రెడ్డి పాలనలో కూడా పోడు భూములకు పట్టాలు ఇచ్చారు. జిల్లాలోని గిరిజన ప్రాంతంలో సుమారు 3,220 మంది గిరిజనులకు సుమారు 69,815 ఎకరాల్లో పోడు భూములకు ప్రభుత్వం ఐటీడీఏ పరిధిలో 5 గిరిజన మండలాల్లో పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులకు పట్టాలివ్వడం జరిగింది.

కూలీలను రైతులుగా చేసింది వైఎస్సార్ కుటుంబమే



తరతరాలుగా పోడు భూములు సాగు చేస్తున్నా ఆ భూములకు హక్కులేక గిరిజనులు అనేక అవస్థలు పడేవారు. అయితే నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో అటవీ హక్కుల చట్టంలో పోడు భూములకు పట్టాలు ఇచ్చి కూలీలను రైతులుగా మార్చారు. బోర్లు వేయించి ఆ పంటల్లో సిరులు పండించే విధంగా కృషి చేశారు. అలాగే ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా పట్టాలిచ్చి రైతు భరోసా పథకంలో ఆర్థిక భరోసా కల్పించారు. పోడు భూముల్లో నేడు సిరులు పండిస్తూ ఆదివాసీ గిరిజనులు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు.

– తెల్లం బాలరాజు, పోలవరం ఎమ్మెల్యే

నిరుపేదగా ఉన్న నన్ను రైతును చేశారు



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నాకు 5 ఎకరాల భూమిని పంచి ఇవ్వడంతో పాటు ఆ భూముల్లో బోర్లు వేసి ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించారు. దీంతో నేను ఆ భూముల్లో పత్తి, మొక్కజొన్న, బెండ, కంది వంటి పంటలు పండిస్తున్నాను. వ్యవసాయ కూలీగా ఉన్న నేను రైతుగా మారతానని కలలో కూడా అనుకోలేదు. నిరుపేదగా ఉన్న నన్ను రైతుగా మార్చిన ఘనత వైఎస్ రాజశేఖరరెడ్డిదే. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాను.

– ముచ్చిక బేబి, గిరిజన మహిళా రైతు, మర్లగూడెం

ఆ భూములకు హక్కుదారులం మేమే



నాకిచ్చిన ఐదెకరాల పోడు భూమిలో రెండు ఎకరాల్లో వంగ తోట, మిగిలిన మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంట పండిస్తున్నాను. పోడు భూములకు పట్టాలు లేక ఫారెస్ట్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో అని గతంలో భయపడే వాళ్లం. ఇప్పుడు ఆ భయంలేదు. ఇప్పుడు ఆ భూములకు హక్కుదారులము మేమే. కూలీలం రైతులుగా మారాం.

– కొవ్వాసి ముక్కయ్య, గిరిజన రైతు, మర్లగూడెం

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న, జెడ్పీటీసీ రమేష్, నేతలు

కామవరపుకోట: ఆడమిల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీసీ రోడ్డు నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ, జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ కడిమి రమేష్, చింతలపూడి మాజీ ఏఎంసీ చైర్మన్ మేడవరపు శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడత రమేష్ బాబు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. మండల పరిషత్ నిధులు రూ.4 లక్షలు, మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. సర్పంచ్ కర్రిపోతు అనూష, ఉప సర్పంచ్‌లు మేడూరి రంగబాబు, చిలుకూరి శ్రీను, ఎంపీటీసీలు ఉప్పలపాటి సాయిబాబు, ప్రశాంత్, వేముల సాయి, నల్లమెల్లి మోహన్, దొడ్డి మనోహరం, రామకృష్ణ, మల్లేశ్వరావు పాల్గొన్నారు.

పరింపూడిలో అభివృద్ధి పనులు ప్రారంభం



నూతన డ్రైయినేజీని ప్రారంభిస్తున్న సర్పంచ్

కొయ్యలగూడెం: పరింపూడి పంచాయతీ పరిధిలో నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్డు, డ్రెయినేజీని స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శనివారం సర్పంచ్ ముప్పిడి విజయకుమారి ప్రారంభించారు. ఈ పంచాయతీలో రూ.4 లక్షలతో రెండు సీసీ రోడ్లు, రూ.8 లక్షలతో రెండు డ్రెయినేజీలు, సుమారు రూ.14 లక్షలతో ఏడు రబ్బిష్ రోడ్లు చేపట్టినట్లు తెలిపారు. కొన్ని పనులు పూర్తికాగా మరికొన్ని పనులు నిర్మాణంలో ఉన్నట్లు సర్పంచ్ తెలిపారు. అదేవిధంగా ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీటీసీ, ఎంపీపీ నిధులు సుమారు రూ.కోటి 50 లక్షలతో అభివృద్ధి పనులను గతంలోనే ప్రారంభించామన్నారు.

దసరా ఉత్సవాలకు సిద్ధం



ద్వారకాతిరుమల క్షేత్ర దేవత శ్రీ కుంకుళ్లమ్మకు పసుపు, కుంకుమ, చీరను తీసుకొచ్చిన చిలుకూరి మహిళలు



చింతలపూడి విశ్వనాథ ఆశ్రమంలో శ్రీరాజరాజేశ్వరీ అమ్మవారు

ద్వారకాతిరుమల: దసరా ఉత్సవాలకు శ్రీవారి క్షేత్రం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆదివారం నుంచి ప్రారంభం కానున్న ఈ ఉత్సవాలను పురస్కరించుకుని దేవస్థానం వారు ఆలయాన్ని, పరిసరాలను విద్యుద్దీప తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. దీంతో క్షేత్ర పరిసరాలు విద్యుద్దీప కాంతులతో మిరమిట్లు గొలుపుతున్నాయి. గ్రామంలోని చిలుకూరి ఇంటిపేరు గల మహిళలు అమ్మవారిని తమ ఆడపడుచుగా భావించి ప్రతి ఏటా వలె ఉత్సవాల ప్రారంభం ముందురోజు అయిన శనివారం రాత్రి కుంకుళ్లమ్మకు పసుపు, కుంకుమ, చీర, పూలు, పండ్లను సమర్పించారు. ఇదిలా ఉంటే ఉత్సవాల ప్రారంభం రోజు అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు తెలిపారు.

కొయ్యలగూడెం: దేవీ శరన్నవరాత్రులు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు అమ్మవారి ఆలయాల వద్ద ఏర్పాట్లు చేశారు. ఈనెల 23వ తేదీ వరకు నిర్వహించే నవరాత్రి ఉత్సవాలలో భాగంగా జగన్మాతను పలు రూపాలుగా అలంకరించనున్నారు. కొయ్యలగూడెం శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ ఆలయం వద్ద, శ్రీ మీనాక్షి సుందరేశ్వర స్వామి, వై.జంక్షన్ శ్రీ విజయ దుర్గమ్మ, బయ్యనగూడెం శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ, కన్నాపురం శ్రీ విజయలక్ష్మి కనకదుర్గమ్మ, శ్రీ దుర్గా భవాని రసలింగేశ్వర స్వామి ఆలయాలతో పాటుగా గ్రామ దేవతల ఆలయాలు, శివాలయాలు శరన్నవరాత్రుల శోభను సంతరించుకొనున్నాయి. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబిస్తూ బోనాల ఉత్సవం నిర్వహించడం గత దశాబ్ద కాలంగా బయన్నగూడెం గ్రామస్తులు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 24వ తేదీ సుమారు వెయ్యి మందికి పైగా మహిళలు బోనాల ఉత్సవంలో పాల్గొనడానికి ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు నిర్వాహకులు తోరం సుబ్బారావు తెలిపారు.

బుట్టాయగూడెం: గిరిజన ప్రాంతంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు చేశారు. ఉదయం 9:30 నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక త్రిశక్తి పీఠంలో, రెడ్డిగణపవరం కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో, మర్లగూడెంలోని అటవీ ప్రాంతంలో కొలువైన పాటిమ్మ, కనకదుర్గమ్మ ఆలయంతోపాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పందిర్లలో ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. కాగా త్రిశక్తి పీఠంలో నేడు అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు సమన్వయకర్త జలగం భాస్కరరావు తెలిపారు.

చింతలపూడి: సుప్రసిద్ధ విశ్వనాథ మఠంలో ఆదివారం నుంచి ఈనెల 24 వ తేదీవరకూ శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఫిట్‌పర్సన్ ఎస్ఎస్ఎస్ శర్మ తెలిపారు. 15న విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, ఋత్విక్ వరుణ, అఖండ దీపారాధన, మహా కలశస్థాపనతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు. 24న ఋత్విక్‌లకు సన్మానములు, రాత్రి శమీపూజ, రాజరాజేశ్వరీ అమ్మవారి రథోత్సవం, 25న సామూహిక సత్యన్నారాయణస్వామి వ్రతాలు జరుగుతాయని తెలిపారు.

ప్రతి గడపకూ సంక్షేమ లబ్ధి

చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

లింగపాలెం: గడపగడపకూ అభివృద్ధి, సంక్షేమం అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతోందని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. లింగపాలెం మండలంలోని కలరాయునగూడెం గ్రామంలో శనివారం 192వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఎమ్మెల్యే ఎలీజా, స్థానిక సర్పంచ్ చలగుళ్ల రవిబాబు, పార్టీ నాయకులతో కలసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఏమైనా సమస్యలు ఉన్నాయా, ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ మండలపు సాయిబాబు, మండల వైఎస్సార్ సీపీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొఠారి మోహన్, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, ఏఎంసీ డైరెక్టర్ కె.రామకృష్ణ, చలగుళ్ల సూరిబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు తాడేపల్లి శాంతరావు, కె రమేష్, టి.మోహనరావు, మోరంపూడి జగన్, పి.వేమనరెడ్డి, ఎం.నరసింహారావు, ఎం.సుమన్ అధికారులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

టి.నరసాపురం: అసమానతలను అధిగమించి ఉన్నత స్థితికి చేర్చేది విద్య అని కెనరా బ్యాంక్ మేనేజర్ దత్త సాయి తెలిపారు. బొర్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా జ్యోతి పథకంలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శనివారం నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు ఎండీ ఆలీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.